

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## బ్రెజిల్‌లో కృష్ణరాయలు గారు

**ఆహా ఆంధ్రభోజా శ్రీకృష్ణదేవరాయా!** అన్నపాట వినని తెలుగువాళ్ళు ఉండరుగాక ఉండరు. అలాంటి శ్రీకృష్ణదేవరాయల గారి గురించి నేను ఈసారి రాస్తున్నాను అనుకుంటే మీరు పిజ్జాలో కాలేసినట్టే.

ఈ కృష్ణరాయలువారు బ్రెజిల్ నుండి వచ్చారు. ఈయనెవరు? ఎందుకొచ్చారు? ఎక్కడ కలిశారు? ఏం చేయబోతున్నారు అన్న విషయాలు ఈసారి మీతో పంచుకోబోతున్నాను.

రచయితలు విచిత్రమైన మనుష్యులను కలుస్తారా? లేక విచిత్రమైన వాళ్ళు వెతుక్కుంటూ వచ్చి రచయితలను కలుస్తారా అన్నది నాకు ఎప్పటికీ చిక్కుముడే!



సరే కథ ప్రారంభానికొస్తే 1995 అనుకుంటా ఒక రోజు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌గారి ఆఫీసులో ఒక అందమైన కుర్రాణ్ణి నేనూ, మా ఆయనా చూశాం. అతను శ్రీ కె.యస్.రామారావుగారు తీసిన ‘ బాయ్ ఫ్రెండ్ ‘, ‘ బాబాయ్ హోటల్ ‘ సినిమాల్లో హీరో అని తెలిసింది. హీరోకి ఉండాల్సిన అన్ని క్వాలిటీస్ ఉన్నాయి. కాని ఎక్కువ అందంగా ఉన్నాడు పాపం.

అతని పేరు సాయికృష్ణ. ఆ రోజు తరువాత సాయి నా తమ్ముడయ్యాడు. అతని బర్త్‌డే కూడా రిపబ్లిక్ నాడే నా బర్త్‌డే రోజే. నాకు స్నేహితులైన వాళ్ళల్లో చాలామంది బర్త్‌డేలు నా బర్త్‌డే రోజే! మా కామన్ ఫీచర్స్, తొందరపాటూ, సృజనాత్మకతా, దేశదిమ్మెర తనం, అతి తొందరగా ఎదుటి వాళ్ళని నమ్మడం. హీరో రవితేజ పుట్టిన రోజుకూడా జనవరి 26నేట!

‘వెన్నల్లో ఆడపిల్ల‘ అనే సీరియల్‌కి శ్రీ వీరేంద్రనాథ్ దర్శకత్వం చేస్తున్నారు. అందులో రేవంత్, అంటే హీరో మా సాయికృష్ణ. ఒక ఎపిసోడ్‌కి హీరోయిన్ వాయిస్ డబ్బింగ్ చెప్పడానికి నేను వెళ్ళాను. అలా పరిచయం అయిన మా స్నేహం, మా పిల్లలకి ‘మామ‘గా, నాకు తమ్ముడిగా ఇప్పటిదాకా కొనసాగుతూ వచ్చింది!

సాయికృష్ణ ‘రాయుడు‘, ‘ సంప్రదాయం ‘, ‘ రుక్మిణి ‘ సినిమాల్లో యాక్ట్ చేసిన తరువాత తనకి ఏక్టింగ్ లైన్ అచ్చిరాదని తెలుసుకుని, మద్రాస్ షిఫ్ట్ అయిపోయి కంప్యూటర్ కోచింగ్ సెంటర్ ప్రారంభించాడు! అతను చదివింది సివిల్ ఇంజనీరింగ్.

భారతదేశంలో చదివిన చదువులకి సంబంధించిన ఉద్యోగాలు చేసేవాళ్ళు చాలా తక్కువమంది! కానీ జీవితంలో సగం వెచ్చించి ఆ కోర్సులు చదువుతారు. మా ఫ్రెండ్ ఒకత్తి ఎం.ఎస్సీ మైక్రోబయాలజీ చదివి బ్యాంక్ ఆఫీసర్‌గా ఉంది. ఇంకొకతను న్యూక్లియర్ ఫిజిక్స్, మాష్టర్స్ చేసి డైరెక్టర్ అయ్యాడు. ఇలా చాలా సార్లు జరుగుతుంది. సో... సాయి అసలు పేరు 'శ్రీకృష్ణ'. అతను స్థాపించిన బిజినెస్, ఆదిలోనే హంసపాదులా నష్టాలొచ్చి, మూసి వేయాల్సొచ్చింది. కానీ ఈలోగా సాయి ఖాళీగా ఉండే పిల్లాడు కాదు! అతనికి రకరకాల ఫీల్డుతో సంబంధాలున్నాయి. కొన్ని రోజులు సీరియల్స్ తీస్తున్నా అనేవాడు.. నన్ను కథా చర్చల్లో బిజీగా పెట్టేవాడు.. కొన్నాళ్ళు రియల్ ఎస్టేట్స్ అని ఊటీలో రిసార్ట్స్ కట్టిస్తున్నా అనేవాడు. ఇంకొంతకాలానికి ఒక 'హాలివుడ్'లో సినిమాలు నిర్మించే సంస్థతో అనుబంధంగా ఇంగ్లీషు సినిమాలు తీస్తున్నాం అన్నాడు. ఏది చేసినా నన్ను మాత్రం బిజీగా నా మెదడంతా అల్లిబిల్లిగా బోలెడు ఆలోచనలతో ఉండేటట్లు చేసేవాడు.

నేను ఎప్పుడు ఫోన్ చేసినా 'ఇటలీ! జపాన్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, బ్రెజిల్' .. ఇలా రకరకాల ప్రదేశాల నుండి మాట్లాడేవాడు.

ఒకనాడు సడెన్‌గా "బ్రెజిల్ వెళ్ళి వచ్చాను.... అద్భుతమైన కాన్సెప్ట్ తెచ్చాను" అని దిగాడు.

అప్పుడే సెల్‌ఫోన్ల వాడకం మొదలయిన కాలం అది. ప్రేక్షకులకి ఒక ఎపిసోడ్ చూపించి, మనమే రెండు ముగింపులు ఇచ్చి, ఏది ఎన్నుకుంటారో సెల్‌లో మెసేజ్ ఇమ్మనే ఎపిసోడ్స్. ఇప్పటి మన ఎస్.ఎం.ఎస్ కాంటెస్ట్‌లకి అది ప్రారంభం అన్నమాట. కానీ అప్పుడు ఎస్.ఎమ్.ఎస్ రెండు రూపాయలు ఉండేది. కాల్ నాలుగు రూపాయిలు! అది గొప్ప స్థాయిలో ప్రారంభం అయి, అంతే స్థాయిలో పరాజయం పొందింది. కానీ కథలు మాత్రం అద్భుతంగా ఉన్నాయి! అన్నీ బ్రెజిల్ కథలు. దానికి 'ముడువు ఉంగళ్ కయ్యిల్' అని పేరు పెట్టారు  మనుషుల మనోభావాలు మాత్రం ఒకటే! ఆ బ్రెజిల్ కనెక్షన్ ఎందుకంటే, అక్కడ 'రాయలు'గారనే తెలుగాయన ఉండడం వల్ల అని చెప్పాడు. కానీ నేను పెద్దగా పట్టించుకోలేదు.

సరే.. కాలగతిలో పదహారేళ్ళు గడిచిపోయాయి. సాయీ నేనూ ప్రతి సంవత్సరం పుట్టినరోజు నాడు చెయ్యాల్సిన పనుల గురించి మాట్లాడుకుంటూనే ఉన్నాం. కానీ ఏవీ జరగడం లేదు. ఈ వేగవంతమైన జీవన విధానంలో సాయి ఓ అతి ముఖ్యమైన పనిని మర్చిపోయాడు. అది ఏమిటంటే. పెళ్ళి! 'ఇప్పుడే ఏం తొందర? ఇంకా ఏమీ సాధించలేదు' అని మొదట్లో "ఇప్పటికీ ఏం సాధించలేదు, ముందు ఈ చిక్కులు తీర్చుకోనీయండి" అని కొన్నాళ్ళూ, 'ఇప్పటికే ఆలశ్యం అయిపోయింది.. ఇంక ఎందుకులెండి' అని తరువాతా.... వాయిదా వేస్తూ వచ్చాడు. పాదరసంలా పరుగులు పెట్టే అతని వ్యాపార మనస్థత్వం, క్రియేటివిటీ, కింద గంపకుదురు పెట్టినట్లు ఒక ఆరేళ్ళుగా కుదురుగా ఉన్నాయి. 'బిర్లా శ్లోకా కాన్సెప్ట్ స్కూల్స్'కి సి.ఈ.ఓ.గా అతి దీక్షగా పనిచేస్తూ ఒకేచోట ఉండడం... మా మిత్రబృందం మొత్తాన్ని ఆశ్చర్యపరిచింది! ఈ లోగా నన్ను పెద్దకూతురిలా ప్రేమగా చూసే సాయి తల్లితండ్రులు శేషాచలం, అలివేలు గార్లు... నేను అతని పెళ్ళి గురించి పట్టించుకోవడం లేదని అలిగి మాట్లాడ్డం కూడా మానేసారు! మద్రాసు వెళితే నేను పుట్టింట్లో దిగినట్లు అక్కడే దిగేదాన్ని. ఈ మధ్య వాళ్ళ అభియోగాలకి భయపడి, గబగబా సంబంధాలుకూడా చూసాను. కానీ సాయి 'ముంబై' కూడా మారాకా అతని కల్చర్‌కి తగ్గ సంబంధాలు కష్టం అయ్యాయి.

ఒకనాడు 'మీరు చాలా సంతోషించే వార్త... నేను పెళ్ళి చేసుకుంటు'న్నాను అని ఫోన్లో చెప్పాడు. ఆ రోజు సెప్టెంబర్ 26వ తారీఖు. నేను ఆనందంతో పెళ్ళికూతురి గురించి రకరకాల ప్రశ్నలు వేసాను. "అమ్మాయి ముంబై అమ్మాయి. 'మయూరి'. మీలాగే రైటర్" అని చెప్పాడు.

పెళ్ళి నవంబర్ 28న ఫిక్స్ అయింది!

జీవితంలో చాలా ఏళ్ళుగా సాయికృష్ణ పెళ్ళి కోసం ఎదురు చూసాం. అందుకే నేను, ఇంకో కామన్ ఫ్రెండ్ సుమిత్రా పంపనా హడావిడిగా ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసేసుకున్నాం. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలు మేం ఎవరితో మాట్లాడినా మేం వెళ్ళబోతున్న సాయి పెళ్ళి గురించి చెపుతూనే ఉన్నాం. సాయి శుభలేఖలతో పాటు మాకు పట్టుచీరలు కూడా పంపించేసాడు!

ఆ శుభ ముహూర్తం రానే వచ్చింది. మేం రెండురోజుల ముందే బయలుదేరి ముంబై వెళ్ళాం. ఏ తమ్ముడు అయినా ఈ వ్యాసం చదివితే తన పెళ్ళిలో అక్కల్ని ఇలా చూసుకోవాలి. సాయి తన పెళ్ళి నాకు అలా ఒక మరపురాని మధుర స్మృతిగా మార్చాడు.



ఎయిర్ పోర్టులో అడుగు పెట్టినప్పటి నుండీ సంజయ్ టెండూల్కర్, రవీ సక్సేనా ఇలా ఎవరో ఒకరు మాతో ఉన్నారు. మమ్మల్ని తీసుకెళ్ళి ‘రినైజెన్స్‘ అనే స్టార్ హోటల్లో పెట్టారు. అసలు వీళ్ళెవరూ సాయికి తెలియదట! స్టాఫట!

మేం ఫ్రెషప్ అయ్యాక సాయికృష్ణ ఉండే హీరానందానీ రోడ్లో ఏవియన్ ఫ్లాట్స్‌కి వెళ్ళాం. ఎంతైనా బొంబాయి.. బొంబాయే అంతా గోల్‌మాల్! లిఫ్ట్ కూడా అది ఎటు వెళ్ళాలో అదె నిర్ణయించుకుంటుంది. వరసగా ఉన్న ఎలివేటర్స్‌లో మనం వెళ్ళాల్సిన నెంబర్ ఎక్కడ వస్తుందో చూసుకుని మనం అటు వెళ్ళాలి. మమ్మల్ని చూసి సాయి ఇంటిల్లిపాదీ చాలా సంతోషించారు. వంట చేసే శర్మగారు పేరడీపాటలు కట్టి, పాడి వినోదింపచేస్తూ, అద్భుతమైన ఉప్మా కూడా చేసి పెట్టారు. మాటల మధ్యలో ‘రాయలు‘ గారి మాట వచ్చింది! ”రాయలుగారు కూడా మీరున్న హోటల్‌లోనే దిగారు. కానీ మీరు ఆయన్ని కలిస్తే నా పెళ్ళికి రావడం మర్చిపోతారు!” అన్నాడు సాయి. నేను ‘ఛ! మరీ మేం అంత వీక్ కాదు‘ అన్నాను.



ఆ తర్వాత నేనూ సుమిత్రా, షాపింగ్, కమ్ వాకింగ్‌కి వెళ్ళి వచ్చేసరికి ఆ సదరు రాయలు గారూ, ఆయన భార్యా, కూతురూ, బ్రెజిల్ అల్లుడూ అక్కడ కనిపించారు! సాయి మమ్మల్ని పరిచయం చేసాడు. ఆయన ఆనందంతో ఎగిరి గంతు వేసి ”మీరు రచయిత్రా? మీతో నాకు పని ఉంది” అన్నాడు. ఆ తరువాత మా జీవితం మా చేతుల్లో లేకుండా పోయింది.

ఈయన సతీమణి యశోధర. పరమ సాధ్వి. ఓరిమి మంతురాలు. ఎందుకో తరువాత తెలుస్తుంది.

ఈయన చిన్నకూతురు ‘కుశుమ్‘అక్కడే పుట్టి పెరిగిన పిల్ల ధారాళంగా స్పష్టమైన తెలుగు మాట్లాడుతుంది! ఇక్కడ కాన్వెంట్‌కి వెళ్ళి మన పిల్లలు, యూ.కేజీలో ”మామ్ పప్పూ అన్నం ఐ హావ్ డన్.. వాట్ నెక్స్ట్? ఐ హేట్ మజ్జిగన్నం” అంటున్నారు. బెంగుళూరు నుండి వచ్చిన పక్కింటి వాళ్ళ పిల్లలు ‘అక్కడ తెలుగు మాట్లాడం, మా కాలనీలో అంతా ఇంగ్లీషే! అందుకే పిల్లలకి తెలుగు రావడం లేదు‘ అని నిస్సిగ్గుగా చెప్పారు! అలాంటిది ‘కుశుమ్‘ చక్కని తెలుగు మాట్లాడుతుంది. కంప్యూటర్ ఇంజినీర్ గా IBM లో వర్క్ చేస్తూ, ఓ పేటెంట్ కూడా రిజిష్టర్ చేసింది ఆ దేశంలో. ఆమె ‘ఫెర్నాండో‘ అనే బ్రెజీలియన్‌ని పెళ్ళాడింది. అతన్ని ‘నందూ‘ అని పిలుస్తుంది! మేం ఆ నాలుగురోజుల్లో చనువు ముదిరి ‘నందూగాడు‘ అన్నాం కూడా! సాయి పెళ్ళిలో ‘నందూగాడి డాన్స్‘ స్పెషల్ ఎట్రాక్షన్! అంతలా కలిసిపోయాడు అతను. అచ్చు మన ‘విలేజ్‌లో వినాయకుడు‘ కృష్ణుడిలా ఉన్నాడు!

రాయలుగారి పెద్ద అల్లుడు గుజరాతీ. కానీ యూ.ఎస్‌లో సెటిల్ అయ్యారు.

ఈ తెలుగు రాయలు గారు చిక్కడపల్లి నుండి ఇస్రోలో సైంటిస్ట్‌గా ఉద్యోగం వచ్చి వెళ్ళి, ఆ తరువాత ఒకనాడు ‘బ్రెజిల్‘ వాళ్ళు పిలిస్తే ఆశ్చర్యపోయి, అందులో నుండి తేరుకునీ, వాళ్ళ కోరిక మేరకు పాస్‌పోర్ట్‌లకి డీటైల్స్ పంపి, యశోధర గారి కడుపులో రెండవసారి ఉన్న బిడ్డ ఆడో మగో తెలీక ‘కుశుమ్‘ అని రాసి పంపించారు. అలా ఆ దేశంలో అడుగు పెట్టారుట.

రాయలుగారు చెప్పిన బ్రెజిల్ దేశం విశేషాలివి! 27 ఏళ్ళ క్రితం శ్రీ గోవిందరాజు కృష్ణరాయలుగారు తన కుటుంబంతో ఆ దేశంలో అడుగు పెట్టారు. అప్పటికి ఆ దేశం డిక్టేటర్‌షిప్ కింద ఉంది. ఎనిమిది సార్లు ఎలక్షన్లలో నిలబడి తరువాత గెలిచి ‘లాలా‘ ప్రెసిడెంట్ అయ్యాడు. అతనికి ఒక వేలు లేదుట! అతని తల్లి పన్నెండుమంది పిల్లలతో, తండ్రి వదిలేసిపోతే కష్టపడి పెంచిందంట. ఈ లాలాగారు ఫక్తు మన భారతదేశపు లీడర్లలాగే, ఎక్కడ కెళ్ళినా, పసిపిల్లల్ని ఎత్తుకుని ముక్కులు తుడిచి, నిరుద్యోగులకి ఉద్యోగాలిచ్చి, పిల్లలకి ఎడ్యుకేషన్ ఫ్రీ చేసి, ముసలివాళ్ళు ఎదురైతే కావలించుకుని ఫోటోలకి ఫోజులిచ్చి, ప్రతిసారీ గెలుస్తూ వచ్చాడట. పద్దెనిమిది కోట్ల జనాభా గల ఈ దేశం, మన దేశానికన్నా మూడింతలు పెద్దదట.


రాయలుగారు, యశోధర గారితో

రాయలు గారు ‘రియో‘లో ఉంటారు. ‘సంపాల‘లోని వాళ్ళ ఇల్లు అర్జెంటుగా మా సుమిత్ర గూగుల్‌లో చూపించింది కూడా! ఇంటి వెనుక స్విమ్మింగ్ ఫూల్.. ఎదురుగా పార్క్, పార్క్‌లో చెట్టూ చెట్టుమీద పిట్టా.. ఆహా! గూగుల్ అంటే అలనాటి శ్రీకృష్ణుడు బ్రహ్మాండం చూపిన ఆ నోరే కదా!


నందు, యశోధర

‘రియో‘ మేప్ చూస్తే ఏసుక్రీస్తు రెండు చేతులూ జాపి శిలువ వేయించుకున్న ఫోటోలా ఉంటుందిట. ఎక్కడో మూలగా ఉన్న కేపిటల్ సిటీని చూసి తిక్కపుట్టి అంతా కలిసి ప్లాన్ వేసి దేశం నడిబొడ్డున ‘బ్రెజీలియా‘ పట్టణాన్ని నిర్మించుకున్నారట. ప్లాన్డ్ సిటీ ఎలా ఉంటుందో వేరే చెప్పాలా? బ్రెజిల్‌లో ‘కాఫీ‘ పంటేకాదు, ఎయిర్ క్రాఫ్ట్స్ కూడా ఎక్కువే. అందుకే వాళ్ళ కేపిటల్ సిటీ విమానం షేప్‌లో కట్టారు! ఎగ్రికల్చర్‌కి పనికి రాని ల్యాండ్‌లో ఎయిరో స్పేస్ టెక్నాలజీ సెంటర్ అని పెట్టారట. CTA, ISRO,INPE.. అన్నీ స్పేస్ టెక్నాలజీ రీసెర్చి సెంటర్లే! ఈ INPE లోనే రాయలుగారు పని చేస్తున్నారు. అబ్దుల్ కలామ్‌గారితో కూడా ఈయన గతంలో పనిచేసారు!

నలభై ఏళ్ళ క్రిందట ఇక్కడ చెరుకు ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో, ఆ చెరుకులో నుండి షుగర్, ఆ షుగర్‌లో నుండి ‘ఇథినాల్‘ అనే ఆల్కహాల్ తయారు చేసి, వాటి మీద కార్లు నడపడం మొదలు పెట్టారుట. ఆ కార్లు రోడ్ల మీద వెళుతున్నప్పుడు ఒక్కటంటే ఒక్క చుక్క పడుతూ వెళ్తాయుట. అందువల్ల పొల్యూషన్ ఫ్రీట! ఇంక ఆ చెరుకు పిప్పిలో నుండి ఎలక్ట్రిసిటీ ప్రొడ్యూస్ చేసుకుంటారుట. వరల్డ్ లార్జెస్ట్ డామ్ ‘ఇత్తెపు‘ ఈ దేశంలోనే ఉంది. ఇండియాలో మనం రోజుకి ఎంత కరెంట్ వాడతామో, అంత కరెంట్ ఈ డామ్ ఒక్కటే ప్రొడ్యూస్ చేస్తుంది! ఎమజాన్ ఫారెస్ట్‌ల గురించి ఆయన చెపుతుంటే మేం నోరు తెరిచి విన్నాం అలాగే మన హెచ్.ఏ.యల్ వాళ్ళు వీళ్ళకన్నా ఎన్నో ఏళ్ళుగా సంస్థ పెట్టి ఎన్ని విమానాలు తయారు చేసారో కానీ వీళ్ళు మాత్రం స్వంత ఎయిర్ క్రాఫ్ట్స్ తయారీలో వరల్డ్‌లో సెకండ్ ప్లేస్‌లో నిలిచారుట. వరల్డ్ లార్జెస్ట్ రివర్.. వరల్డ్స్ లార్జెస్ట్ ఫారెస్ట్, వరల్డ్స్ లార్జెస్ట్ మినరల్ ప్రొడక్షన్, వరల్డ్స్ లార్జెస్ట్ కాఫీ ప్రొడక్షన్... ఇవన్నీ బ్రెజిల్ స్వంతం. ఇక్కడ కరెన్సీ రియల్. రెండు రియల్స్ ఒక డాలర్‌కి సమానం. అంటే మన పదమూడు రూపాయలు వాళ్ళకి ఒక రియల్.

రాయలుగారు ఇంకో ఆశ్చర్యకరమైన విషయం చెప్పారు. అసలు ప్రపంచంలో మొట్టమొదట విమానం బ్రెజిలియన్ కనిపెట్టాడు. రైట్ బ్రదర్స్ కాదు! బ్రెజీలియమ్‌కి పోర్చ్‌గీసు తప్ప రాక ఇంగ్లీషు వాళ్ళు కొట్టేసారుట! చూసారా... ఇంగ్లీష్ రాకపోతే నా సూట్ కేసు కూడా కాలిఫోర్నియాలో పోయేది!

ఇంక రాయలుగారి పర్సనల్ విషయాలకి వస్తే 'రాయలుగారూ - చెత్త' అనే విషయం గురించి ఎంతైనా మాట్లాడుకోవచ్చు! ఈయన మన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్‌కి, మన 'చెత్త' నుండే కరెంట్ ప్రొడ్యూస్ చేసి నెలకి కోటి రూపాయలు సంపాదిస్తున్నారు. అసలు చెత్తని ఎలా ఉపయోగపెట్టాలో బ్రెజిల్‌కి వెళ్ళిన తరువాత ఈయనకి బాగా తెలిసింది. కానీ ఈయన శ్రీమతి యశోధర గారు మాత్రం 'ఇల్లు చెత్తగా పెడతారు' అని కామెంట్ చేసారు! తప్పదు లెండి. ఇంట గెలిచి రచ్చగెలవడం కష్టమే!

అసలు పెద్ద కూతురి పెళ్ళి గురించి కూడా మనం చెప్పుకోవాలి.. కల్వాల రామానుజం గారనే తెలుగు బ్రాహ్మడు బ్రెజిల్‌కి ఆంధ్రదేశం నుండి మొట్టమొదట ఇమ్మిగ్రెంటట! ఆయన అక్కడే స్థిరపడిన తరువాత, అక్కడ మనవరాలి పెళ్ళి చేయాల్సొచ్చిందట. అప్పుడు ఆయన ఇంటర్నెట్‌లో మన పెళ్ళి మంత్రాలు చూసి, రాసుకుని, పోర్చుగీసులో వాటికి అనువాదం చేసి చెపుతూ, ఏ ముచ్చటా సంప్రదాయం మర్చిపోకుండా అక్కడ వాళ్ళు చూసి ప్రసంశించేటట్లు మనవరాలి పెళ్ళి జరిపించారుట! అది చూసి మన రాయలుగారు కూడా ఆయన మార్గంలోనే బ్రెజిల్‌లో తన పెద్దకూతురి పెళ్ళి జరిపించారుట, యశోధరగారు అరిశలూ, లడ్డూలు, జంతికలుతో సహా చేసి, సారె కూడా పెట్టి పంపించారుట! బ్రెజిల్‌లో ఇంకా తెలుగు పురోహితులూ, తెలుగు హోటళ్ళూ, గట్రా రాలేదుట!.. వింటున్నారా?

ఇది జరిగిన 35 సంవత్సరాల తరువాత కల్వాల రామానుజంగారి బ్రెజిల్ కోడలికి తన పెళ్ళి అలా జరగలేదని బాధ కలిగింది.


కల్వాల రామానుజంగారి పెళ్ళిసందడిలో

మొన్న డిసెంబరు 2010 26 వతారీఖునాడు తన కూతురు, మనవడితో సహా ఇండియా వచ్చి ఆవిడ మళ్ళీ శాస్త్రయుక్తంగా తన భర్తని వివాహమాడింది. ఆ పెళ్ళికి నేను, సుమిత్రా పంపన, మా పెద్దబ్బాయి అశ్విన్ వెళ్ళాం ఆ బ్రెజిల్ అమ్మమ్మ పెళ్ళి కూతురి అలంకరణలో బుగ్గన చుక్కతో, కళ్యాణం బొట్టుతో, పసుపు పారాణితో కొత్తగా కట్టించుకున్న మంగళ సూత్రంతో వెలిగిపోతూ కనిపించింది. కల్వాల రామానుజంగారు సంతోషం తీసిన డైరెక్టర్ దశరథ్‌కి పెద తాతగారు. దశరథ్ కూడా ఆ పెళ్ళి విందుకు వచ్చాడు. అప్పుడు రామానుజంగారు బోలెడు కబుర్లు చెప్పారు. అందులో ఒకటి ఇండియా నుండి వెళ్ళిన కొత్తలో వాళ్ళావిడ చీరకట్టుకుని వెళుతుంటే జిప్సీలనుకుని అందరూ చేతులు చూడమనేవారట.


కుశుమ్, యశోధర

రాయలుగారు తన భార్యా, కూతురూ, అల్లుడుతో మాత్రమే వచ్చారంటే అందులో విశేషం ఏముంది? ఆయన ఇంకో బ్రెజిల్ జంటని కూడా తనతో తీసుకొచ్చారు. మోర్గన్, ఎలిజబెత్ అనే భార్యాభర్తలు! వాళ్ళని ఈయన తన ఎపార్ట్‌మెంట్స్ లిఫ్ట్‌లో మూడుసార్లు కలిసారుట! నాలుగోసారి ఇండియా పట్టుకొచ్చారు.

ఇది కుశుమ్ చెప్పిన సమాచారం! రాయలుగారి కాలిబర్‌కి ఇది సులభమే!

ఇంతకీ రాయలుగారు కేవలం సాయి పెళ్ళికి భారతదేశం రాలేదు! ఇంకో

మహత్తరమైన పనిమీద వచ్చారు. ఆయనకోనాడు ఇంటర్నెట్‌లో ఆవుల వల్ల పర్యావరణం మెరుగు అవుతుంది అనీ, దాని పేడ వల్ల వచ్చే ఎరువుల గొప్పదనం గురించిన ఆర్టికల్ కంటపడింది! బెనారస్ దగ్గర ఓ రైతు పరిశోధనలు చేసి మేలు జాతి విత్తనాలు తయారు చేస్తున్నట్లు కూడా తెలిసింది. వెంటనే ఈయన ఆ రైతుని కాంటాక్ట్ చేసి మాట్లాడారు. ఆ రైతు 'తనకి ఈ పేటెంట్లు ఎలా రిజిష్టర్ చెయ్యాలో తెలీదనీ, ఈయన సాయం కావాలనీ' కోరాడు. తక్షణమే ఈయన ఈ లిఫ్ట్‌లో కలిసిన విత్తనాల పరిశోధనా శాస్త్రజ్ఞుడితో సహా ఇండియా బయలుదేరాడు. వచ్చీరాగానే తిన్నగా కాశీ దగ్గర ఆ రైతు పల్లెటూరికి వెళ్ళాడు. అతని ఇంట్లో ఉండి, దోమలచేత కుట్టించుకుని, ఆ జొన్న రొట్టె తిని, తన చేతిలో ఉన్న మూడు లక్షల రూపాయలు ఇచ్చి అతని అప్పులు తీర్చి, ఆ విధానాలని ఆకళింపు చేసుకుని, మిగతా పనుల గురించి వ్యూహం సిద్ధం చేసుకుని పెళ్ళికి వచ్చాడు. ఈలోగా ఇద్దరు యువకులని ఆ పని మీద జీతానికి నియమించారు కూడా!

ఇది రాయలుగారి కార్యక్రమాల్లో ఒకటి మాత్రమే! ఇంకా కొన్ని ఇంట్రెస్టింగ్‌వి ఉన్నాయి. అందులో బ్రెజిల్ గవర్నమెంట్ స్పాన్సర్ చేస్తే ఇండియా, బ్రెజిల్ మధ్య సినిమా తీయడం ఒకటి! ఇది నాకు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఇంకోటి 'భక్త కన్నప్ప' ప్రాజెక్ట్... అంటే 'కళ్ళు దానం చెయ్యండి' అనే ఉద్యమం. మనదేశంలో ప్రతి ఆరునిమిషాలకి ఒకళ్ళు గుడ్డివాళ్ళయిపోతున్నారని తెలిసి ఆయన చాలా వ్యధ చెందారు. కాళహస్తిలో, చిలుకూరులో.. ఇంకా అన్ని యాత్రా స్థలాల్లో ఈ కళ్ళు దానం చేయడానికి ఫార్మ్స్ ఇచ్చి భక్తుల చేత ఈ మంచి పని చేయించాలని ఆయన అభిప్రాయం.

సాయి అన్నదే నిజం అయింది. మర్నాడు బ్రేక్ ఫాస్ట్‌కి హోటల్‌లో క్రింద రెస్టారెంట్‌లో రాయలుగారిని కలిసిన మేం సాయికృష్ణ పెళ్ళికి మేం ముంబై వచ్చాం అన్న విషయమే మర్చిపోయి ఆయన కబుర్లు వింటూ ఉండిపోయాం. సాయంత్రం మెహందీ ఫంక్షన్‌లో చెన్నై నుండి వచ్చిన టీ.వీ. మీడియా వాళ్ళు విజయాదిరాజ్, ఉమా పద్మనాభం, ఇంకా సాయి ఫ్రెండ్స్ మురళీ, బాలమురళీ, అలనాటి అందాలనటి శ్రీప్రియ, ఒకప్పుడు జాతర, ఐ లవ్ యూ లలో చిరంజీవి పక్కన ఏక్ట్ చేసిన సువర్ణా, సుభాషిణీ, ఆవిడ కూతురు పూజా, ప్రొడ్యూసర్ వాణీమూర్తిగారు, ఇంకా చాలామందిని కలిసాం. వాళ్ళు పంజాబీ పాటలకీ, వీళ్ళు తమిళ పాటలకీ పోటా -పోటీలుగా డాన్స్ చేసారు. నేనూ, సుమిత్రా మెహందీ పెట్టించుకుని కూర్చుని ఈ డాన్స్‌లు ఎంజాయ్ చేసాం. బ్రెజిల్ నందూగాడు, గోరింటాకు రెండు చేతులకీ పెట్టుకున్న భార్యకి జ్యూస్ తాగిస్తూ, సమోసాలు తినిపిస్తూ ఆదర్శవంతుడైన పతిగా మెసిలాడు. అంతేకాదు, రాయలగారు కనిపించినప్పుడల్లా డాన్స్ చేస్తూ 'తెలుగు అల్లుడివి కానని బాధపడక...' అన్నట్లు తెగ ఆరాటపడ్డాడు! చాలా సందడిగా ఆ ఫంక్షన్ గడిచింది.

మర్నాడు నేనూ సుమిత్రా సిద్ధి వినాయక గుడికీ, మహాలక్ష్మీ మందిరానికీ, గేట్‌వే ఆఫ్ ఇండియాకీ వెళ్ళి వచ్చాం. తరువాత రోజు పెళ్ళి.

సాయి మాకు అరగంటకోసారి ఫోన్ చేస్తూ అన్నీ సౌకర్యంగా ఉన్నాయో లేవో కనుక్కుంటూనే ఉన్నాడు. ఫైవ్ స్టార్ హోటల్‌లో ఉంచి, ఓ కారునీ డ్రైవర్‌నీ పర్మినెంట్‌గా పెట్టి, అడుగడుగునా తన స్టాఫ్‌ని ఎటెండ్ అయ్యేట్లు చేసి, ఇంకా ఏవైనా కావాలా? అని అడిగే తమ్ముడు ఎంత అదృష్టం చేసుకుంటే దొరుకుతాడూ?

ఆ హోటల్‌లో స్నిఫర్ డాగ్ వచ్చి కారు ఆగగానే వాసన చూస్తుంది. దానిమీద కూడా మేం జోక్‌లు వేసుకున్నాం.

అంతకు ముందే ఓ విషయం మీద మనస్తాపంగా ఉన్న నన్ను ఊరడిస్తూ మా సుమిత్ర "మీకు ఇంకో మంచి ప్రాజెక్ట్ దొరుకుతుంది. బాధపడకండి" అంది.

"డబ్బు కోసం కాదు సుమిత్రా.. కుక్కని తంతే రాలతాయి" అన్నాను.

"అయితే ఈ కుక్కని తన్నండి" అని స్నిఫర్ డాగ్‌ని చూపించింది.

"అమ్మో.. దీని ఉద్యోగం నా ఉద్యోగం కన్నా ఎక్కువ.. దీని శాలరీ ఎక్కువ! అది నా ఎక్స్ బాస్‌తో సమానం అన్నా!" ఇంతలో అది వాసన చూడ్డానికి ముందుకి రాలేదు.

"అదేమిటీ? వెనక్కిపోతోంది?" అంది సుమిత్ర.

"అంతే! వాసన చూడడం జాబ్ కదా.. దానికి బోర్‌గా ఉంది" అన్నా.

సహజమైన, ఇష్టమైన పనులు కూడా జీతం ఇవ్వడం మొదలవగానే బోర్ కొడతాయి!

ఆ హోటల్ నిండా ఫారెనర్సే ఉన్నారు. బాగా తయారయి, పట్టుచీరల్లో ఉన్న మమ్మల్ని విచిత్రంగా చూసేవారు. మేమేకావాలని "ఎలా ఉన్నాం?" అని అడిగి "ప్రెట్టీ.. బ్యూటిఫుల్" అని వాళ్ళ చేత పొగిడించుకుని ఆనందపడ్డాం!



నాలుగురోజులు రొటీన్ మర్చిపోయి నేనూ సుమిత్రా తెగ కబుర్లు చెప్పుకున్నాం. తెగ తిరిగాం... ఎంజాయ్ చేసాం! కాలక్షేపానికి రాయలుగారు ఉండనే ఉన్నారు. ఎయిర్ పోర్ట్‌లో వెంకయ్యనాయుడుగారు కనిపిస్తే, సుమిత్ర "మా వీధిలోనే ఉంటారు, నమస్కారం పెట్టాల్సింది" అని బాధ పడింది. "నమస్కారం ఏం ఖర్మ? మాట్లాడదాంరా" అని నేను సెక్యూరిటీ వాళ్ళతో నేను కలవాలని అనుకుంటున్నాను అని నా పేరు చెప్పాను. ఆయన వెంటనే రమ్మని బాగా మాట్లాడారు.

"మీకు ధైర్యం ఎక్కువ" అంది.

"చెయ్యాలనిపించింది వెంటనే చెయ్యక పోతే జీవిత కాలం విచారించాల్సి వస్తుంది" అన్నాను. నేను దీన్నే నమ్ముతాను. అలాగే కొన్ని కష్టాలు కొని తెచ్చుకుంటాను.. కొందరు స్నేహితులని అడిగి తెచ్చుకుంటాను. .. కొందరి బాధల్ని అప్పుతెచ్చుకుంటాను! కానీ కాలం పరిచిన వైకుంఠపాళిలో చిన్నపాములకి భయపడను.. పెద్ద నిచ్చెనలకోసం ఆశపడను... నా నిచ్చెనలన్నీ నా స్నేహాలు! అవి అంచెలంచెలుగా నన్ను పైకి తీసుకు వెళతాయి. ఆనందాన్ని మించిన పరమపద సోపానం ఏమిటి?




సాయికృష్ణ తాతగారు రావుబహద్దూర్ గారు. నేను ఎప్పుడూ సరదాకి 'జమిందార్'వి నీకేవిటి? అనేదాన్ని. అచ్చు అలాగే జమిందారీ హోదాలో సాయికృష్ణ పెళ్ళి అత్యంత వైభవంగా ఐదురోజుల ముచ్చట్లతో జరిగింది! అలాగే నెల్లూరులో, విద్యేశ్వరంలో, చెన్నైలో, హైదరాబాద్‌లో రిసెప్షన్‌లు కూడా గ్రాండ్‌గా జరిగాయి.

సాయికృష్ణకీ మయూరికీ ఆ భగవంతుడు ఆనందకరమైన వైవాహిక జీవితాన్ని అందించాలని కౌముది ద్వారా కోరుతున్నాను....

**NEW**
Click here to share your comments on this article